## మాధురి శ్రీవారు!

**- కృష్ణమూర్తి గూటాల**

గోపాల్, అనిల్ మరియు రాము, ఆ ముగ్గురూ ప్రాణ స్నేహితులు. ఒక సాయంత్రం కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ దగ్గరలో వున్న పార్కుకి వెళ్ళారు. ఎంతో అందంగా వుంది ఆ పార్కు. చక్కని రంగురంగుల పూలు, గుబురుగా చెట్లు, విశాలమైన పచ్చని లాన్లు, దూరంగా క్రీడా స్థలంలో పిల్లల కోలాహలం, అంతా ఎంతో రమ్యంగా వుంది. సరదాగా ఏదో లోకాభిరామాయణం తిరగేస్తుండగా, మామూలుగా వచ్చేలాగే, సినీమా విషయాలొచ్చాయి సంభాషణలోకి. ఆ రోజున హిందీ సినీమా విషయాలొచ్చాయ్.

**గోపాల్** : అరే అనిల్! నీకు మాధురీ దీక్షిత్ యొక్క శ్రీవారెవరో తెలుసునురా?

**అనిల్** : నేనే!

**గోపాల్** : నువ్వేమిట్రా? నేను అడుగుతున్నది హిందీ సినీ ప్రఖ్యాత తార మాధురీ దీక్షిత్ శ్రీవారిని గురించి.

**అనిల్** : నేనే!

గోపాల్ ఇహ వీణ్ణి అడిగి లాభం లేదని, రామూ ప్రక్కకు తిరిగి, 'అరే రామూ! నువ్వేనా సరిగ్గా చెప్పరా, మాధురీ దీక్షిత్ శ్రీవారెవరో.'

**రాము** : నేనే!

గోపాల్‌కు మతి పోయినంత పనైయ్యింది. ఇహ లాభం లేదని, వేరే విషయాల మీదకు మర్లింది సంభాషణ. రాత్రవగానే ఎవరిళ్ళకు వారు వెళ్ళిపోయారు.

గోపాల్‌కు మాత్రం బుర్రలో దొలుస్తునే వుంది ఆ ప్రశ్న. తరువాత నాలుగైదు రోజుల వరకూ గోపాల్ ఎవరిని ఆ విషయం అడిగినా, అచ్చం అదే సమాధానం. ఇహ చివరికి విసుగు చెంది, ఎవరినీ అడిగి లాభం లేదని నిశ్చయించుకున్నాడు, ఎప్పటికైనా తెలియక పోతుందా అని.

కొద్ది రోజుల తర్వాత వాళ్ళ పట్టణానికి ఏదో సినీమా షూటింగ్ సందర్భంలో మాధురీ దీక్షిత్తే అక్కడకు వచ్చిందని గోపాల్‌కు తెలిసింది, ఎవరి ద్వారానో. గోపాల్‌లో మళ్ళీ చిగురించింది ఆ వెనుకటి ప్రశ్న. ఇహ వీరినీ వారినీ కాదు, సాక్షాత్తూ ఆవిడనే అడిగి తెలుసుకుందామనుకున్నాడు. ఫలానా చోట షూటింగ్ జరుగుతోందని తెలుసుకొని, ఆ పూట సెలవుపెట్టి, అక్కడికి హుటాహుటీ వెళ్ళాడు. అక్కడ ఆవిడ షూటింగ్ అయిన తర్వాత తాను ఏదో పేపర్ రిపోర్టర్ని అని బుఖాయించి, ఏదో విధంగా ఆవిడ గ్రీన్ రూమ్‌కి వెళ్ళాడు. ఆ మహాతారను చూసేటప్పటికి గోపాల్ హృదయం ఉప్పొంగి పోయింది. ఇహ కాస్త తేరుకున్న తర్వాత, ఆవిడతో సంభాషణ.

**గోపాల్** : మాధురీ గారూ! నమస్కారం. మిమ్మల్ని కలిసే భాగ్యం కలిగింది ఇన్నాళ్ళకు నాకు. చాలా సంతోషంగా వుందండి. నేను ఎప్పటినించో మీ విషయంలో ఒక సమాచారం తెలుసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్నానండి!

**మాధురి** : అదేమిటో సెలవిస్తారా?

**గోపాల్** : అది మీ పర్సనల్ విషయమండీ. మీకు అభ్యంతరం లేదంటే, నాకు అడిగే ధైర్యం వస్తుంది. మీ అనుగ్రహం. (అని గోపాల్ నమ్రతతో అన్నాడు)

**మాధురి** : పరవాలేదు, అడగండి, మీ కంత అభిలాషగా వున్నప్పుడు. చెప్పతగ్గదైతే చెబుతాను.

**గోపాల్** : అమ్మా! మీ శ్రీవారెవరు?

**మాధురి** : నేనే!

**గోపాల్** : మీ శ్రీవారమ్మా?

**మాధురి** : నేనే!

**గోపాల్** : తల్లీ! నేను ఈ విషయం గత వారంనించి ఎంతమందిని అడిగినా, ఇదే సమాధానం వస్తోందమ్మా! ప్రతివారూ 'నేనే' అంటారు. నాకు మతి పోయినంత పనైంది. అయినా, మీరేమీ అనుకోకపోతే, నాకు అడగాలనిపిస్తోంది, ఎవరిని అడిగినా, మా శ్రీవారు 'నేనే' అంటున్నారు, మరి మీకు ఇంతమంది ఎట్లా వుంటారు తల్లీ? దీని అంతర్యం ఏమిటమ్మా? నాకు అర్థం కావటం లేదు. (అన్నాడు గోపాల్ విస్తుపోతూ.)

**మాధురి** : (కోపం తెచ్చుకునే బదులు, నవ్వుతూ, అందులోనూ ఆమె నవ్వు చాలా ప్రసిద్ధమైనది!) మీరు అడిగేది మా శ్రీవారిని గురించేనా?

**గోపాల్** : అవునండి!

**మాధురి** : చూడండి, మా శ్రీవారి పేరు డాక్టర్ నేనే. వారు మహారాష్ట్రీయులు. కాని ఆయన అమెరికాలో ఎల్. ఏ. లో వుంటారు. (అని నవ్వును కొనసాగించింది.)

ఈ విధముగా మాధురి తెలియజేసేటప్పటికి గోపాల్‌కి జ్ఞానోదయం కలిగింది. థాంక్స్ చెప్పి బైట పడ్డాడు, గతవారం అంతమందినీ తిట్టుకున్నానే, అని పశ్చాత్తాప పడుతూ.

గత వారం రోజులుగా దొలిచిన సొరంగానికి (ప్రశ్నకి), చిట్టచివరకి వెలుగురేఖలు (సమాధానం) కనిపించి, పని పూర్తి అయినట్లు (మనసు కుదుటపడినట్లు) తోచి, హాయినిగొల్పే ఆనందాన్ని ఇచ్చాయి గోపాల్‌కి.

*మాకో ఆరు నెలల వయస్సున్న అమ్మాయి ఉంది. ఆమెను ఎప్పుడూ ఎవరో ఒకరు ఎత్తుకుని ఉండాలి. మనము ఆమెను ఎత్తుకుంటే సరే! లేకపోతే ఆమె ఎత్తుకుంటుంది. ఏమిటది?*
*సమాధానం : రాగం.*